పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అదిరాజ్ సింగ్‌రాణా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించి పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరస్పర బదిలీలు, మెడికల్ గ్రాంట్స్‌కు సంబంధించిన సమస్యలు పోలీసులు తెలియజేశారని, విధి నిర్వహణలో సిబ్బంది సతమతమవ్వకుండా వారి సమస్యల్ని పరిష్కరిస్తామన్నారు.

గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమయ్యే ఆధునిక పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం పద్మావతినగర్‌లోని పింగళి సూరన్న స్మారక శాఖ గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠకుల డిమాండు మేరకు పుస్తకాలను తెప్పిస్తున్నారా? లేదా? అని గ్రంథాలయాధికారి శ్రీధర్‌ను ప్రశ్నించారు. బడ్జెట్ కేటాయింపులు జరిగిన వెంటనే పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను తెప్పించి అందుబాటులో ఉంచాలన్నారు. ఆన్‌లైన్ పరీక్షల సాధనకు అవసరమయ్యే కంప్యూటర్లను గ్రంథాలయంలో ఏర్పాటు చేయాలన్నారు. చిన్నపాటి మరమ్మతులు చేయించుకోవాలన్నారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని విక్టోరియా రీడింగ్ రూమ్‌ను ఆమె పరిశీలించారు. కమిషనర్ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పరిశీలిస్తున్న రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని 439 అంగన్‌వాడీ కేంద్రాల్లోని మరుగుదొడ్ల నిర్మాణాల్ని ఎందుకు పూర్తి చేయలేదని కలెక్టర్ జి.రాజకుమారి ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, సీడీపీవోలతో ఆమె సమీక్షించారు.

పారిశ్రామికవాడ.. ఉపాధి మేడ

ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో 'ఉపాధి' మేడల నిర్మాణానికి పునాదులు పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో రానున్న ఐదేళ్లలో రూ.10 వేల కోట్లతో పారిశ్రామికవాడలో మౌలిక వసతులు కల్పించేలా లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు. 9,936 ఎకరాలను పరిశ్రమలకు అనువుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా భారీ పరిశ్రమలను ఆహ్వానించేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో పాలకులు ముందుకెళ్తున్నారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు ఓర్వకల్లు పారిశ్రామిక వాడ కేంద్ర బిందువుగా మారనుందని అధికారులు పేర్కొంటున్నారు.

- ఓర్వకల్లులో చకచకా ఏర్పాట్లు
- 9,936 ఎకరాల్లో మౌలిక వసతులు
- భారీ పరిశ్రమల స్థాపనకు ప్రణాళిక



1 గుట్టపాడులో 413.19 ఎకరాల విస్తీర్ణంలో జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి కానున్నాయి. వచ్చే ఏడాది పరిశ్రమను ప్రారంభించేందుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పరిశ్రమకు 0.15 టీఎంసీ నీరు అవసరం కాగా.. ప్రస్తుతం ఆ పరిశ్రమ యాజమాన్యం 45 ఎకరాల్లో చెరువు తరహాలో రిజర్వాయర్ ఏర్పాటు చేసుకుంది. రూ.2,938 కోట్లతో చేపట్టిన స్టీల్ పరిశ్రమ వినియోగంలోకి వస్తే ప్రత్యక్షంగా 1,030 మందికి, పరోక్షంగా మరో 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

2 సిగాచి ఫార్మా బయోటెక్ కంపెనీకి 25.09 ఎకరాలు కేటాయించారు. రూ.285 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమను వచ్చే ఏడాది ప్రారంభించేందుకు పనులు ముమ్మరం చేశారు. అందుబాటులోకి వస్తే 850 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయి.

3 ఆర్‌పీఎస్ ఫార్మాను 12 ఎకరాల్లో నెలకొల్పనున్నారు. రూ.90 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటుకానున్న పరిశ్రమలో సుమారు 285 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి.

4 ప్రైమో పాలి ప్యాక్ (ప్లాస్టిక్) పరిశ్రమకు ఐదు ఎకరాలు కేటాయించారు. రూ.3.37 కోట్ల పెట్టుబడులతో చేపడుతున్న ఈ పరిశ్రమ 2025లో ప్రారంభం కానుంది. ఈ పరిశ్రమ అందుబాటులోకి వస్తే 95 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు రానున్నాయి.

ముందుకొచ్చిన కేంద్రం

- ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ ప్రాజెక్టుకు 2014-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం పునాది వేసింది. హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిని ఆనుకుని పది వేల ఎకరాల్లో తీర్చిదిద్దాలని ప్రణాళికలు రూపొందించారు. 9,936 ఎకరాలు సేకరించి ఏపీఐఐసీకి బదలాయించింది. పరిశ్రమల ఏర్పాటుకు కొన్ని సంస్థలు ముందుకొచ్చాయి.
- ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ఐదేళ్లలో ఒక్క పరిశ్రమను తీసుకురాలేదు. స్థానికంగా ఉపాధిలేక యువత వలస బాట పట్టారు.
- సమస్యను గమనించిన 'కూటమి' ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో పారిశ్రామికవాడ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేందుకు ముందుకొచ్చింది.
- ఓర్వకల్లు పారిశ్రామికవాడకు రూ.2,500 కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నేపథ్యంలో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఐసీడీసీ) ఆధ్వర్యంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. మొదటిదఫా ఉప్పలపాడు, మీదివేముల, ఎన్.కొంతలపాడు గ్రామాల పరిధిలో 2,600 ఎకరాలు కేటాయించారు. రానున్న రెండేళ్లలో మొదటి దశ పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :

పంచవర్ష ప్రణాళిక

- 2025-27 కాల వ్యవధిలో కేంద్ర ప్రభుత్వ నిధులతో మొదటి దఫా 2,600 ఎకరాలు, అదే క్రమంలో 2,400 ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఐఐసీ కలిసి పారిశ్రామికవాడలను అభివృద్ధి చేయనున్నాయి. ఈ మూడింటి భాగస్వామ్యంతో 5,505 ఎకరాల్లో పారిశ్రామికవాడ వినియోగంలోకి రానుంది.
- 2027 నుంచి 2029 వరకు కేంద్రం ఎన్‌ఐసీడీసీ ద్వారా రెండో దఫా 2,456 ఎకరాల పారిశ్రామిక భూముల్లో వసతులు కల్పించనుంది. 1,975 ఎకరాలను ఏపీఐఐసీ అభివృద్ధి చేయనుంది.
- పారిశ్రామిక వాడ కోసం దూపాడు-బేతంచెర్ల వరకు 50 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ ఏర్పాటుకు సర్వే పనులు పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

పరిశ్రమల గుట్ట

★ ఓర్వకల్లు మండలం గుట్టపాడులో మైక్రో స్మాల్ ఎంటర్‌ప్రైనుర్స్ క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రాజెక్టు (ఎంఎస్‌సీసీడీపీ) ఏర్పాటు కానుంది. 219.38 ఎకరాల విస్తీర్ణంలో మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం 70 శాతం, ఏపీఐఐసీ 30 శాతం నిధులతో అభివృద్ధి చేయనున్నాయి.

★ రూ.19.10 కోట్లతో వసతులు కల్పించనున్నారు. రూ10.80 కోట్లతో 3.54 కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్లు, 4.5 కిలోమీటర్ల మేర రహదారులు, డ్రైన్లు, కల్వర్టులను అభివృద్ధి చేయనున్నారు.

★ ఎంఎస్‌ఎంఈ తరహాలో ఉండే ఈ ప్రాజెక్టు పనులు పూర్తయితే 200 ప్లాట్లతో లేఅవుట్ వేయనున్నారు. ఫలితంగా రెండొందల వరకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు రానున్నాయి.

బిల్లులో కమీషన్ లొల్లి

■ నీరు-చెట్టు గుత్తేదారుల ఫిర్యాదు



నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: గతంలో చేపట్టిన నీరు-చెట్టు పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో అధికారులు అక్రమాలకు తెరలేపారు. అస్మదీయ గుత్తేదారుల దస్త్రాలు చకచకా కదలడం.. మిగిలిన వాటికి కొర్రీలు పెడుతున్నారు. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం 'నీరు-చెట్టు' పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా చెరువుల్లో పూడిక తీత, ముళ్లపొదల తొలగింపు వంటి పనులు చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా బిల్లులు చెల్లించకపోవడంతో కొందరు గుత్తేదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన 'కూటమి' ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసింది.. ఒక్క నంద్యాల జిల్లాకే రూ.20 కోట్లు కేటాయించింది. వాటి చెల్లింపులో అధికారులు చేతివాటం చూపుతున్నారు. ఈ వ్యవహారంపై కొందరు గుత్తేదారులు కలెక్టర్‌కు లేఖ రాయడంతో కలకలం సృష్టిస్తోంది.

గుట్టుగా బిల్లుల అప్‌లోడ్

'నీరు- చెట్టు' పథకం కింద నంద్యాల, శ్రీశైలం, బనగానపల్లి, ఆళ్లగడ్డ, పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని 25 మండలాల పరిధిలో 152 చెరువుల్లో 3,583 పనులు చేపట్టారు. ఒక్కో పనికి కనిష్ఠంగా రూ.5 లక్షలు, గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. నాలుగు పద్ధతుల్లో బిల్లులను అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఉద్యోగులను ఆదేశించింది. న్యాయస్థానానికి వెళ్లిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. న్యాయస్థానానికి వెళ్లని గుత్తేదారుల బిల్లులను అప్‌లోడ్ చేయడంతో వివాదం రేగింది. వారిలో లాలూచీపడిన కొందరు అధికారులు, సిబ్బంది కమీషన్లు తీసుకుని బిల్లులను అప్‌లోడ్ చేశారు.

చేతులు మారిన రూ.2 కోట్లు

10 శాతం కమీషన్ తీసుకుని బిల్లులు అప్‌లోడ్ చేశారని కొందరు గుత్తేదారులు ఇటీవల కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో అధికారులు, సిబ్బంది కలిసి రూ.2 కోట్ల వరకు పంచేసుకొన్నట్లు తెలుస్తోంది. ఇందులో ఓ అధికారి కీలకంగా వ్యవహరించి నంద్యాల, శ్రీశైలం, ఆళ్లగడ్డ నియోజకవర్గాల గుత్తేదారులకు ఎక్కువ లబ్ధి చేకూరేలా ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆరేళ్లుగా బిల్లులు రాక అప్పులపాలయ్యాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగులు కమీషన్లు డిమాండు చేస్తున్నారని గుత్తేదార్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రీశైలం దేవస్థానం ఈవో బదిలీ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) డి.పెద్దిరాజును బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను మాతృశాఖ రెవెన్యూకు పంపిస్తూ ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న పెద్దిరాజు 13 నెలల పాటు శ్రీశైలం ఈవోగా విధులు నిర్వర్తించారు. శ్రీశైలంలో సహాయ కమిషనర్ ఈ.చంద్రశేఖర్‌రెడ్డికి ఈవోగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ ఉత్తర్వుల్లో గందరగోళం

శ్రీశైలం దేవస్థానం ఈవో డి.పెద్దిరాజును బదిలీ చేస్తూ శుక్రవారం దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ జారీ చేసిన ఉత్తర్వుల్లో గందరగోళం నెలకొంది. ప్రధాన దేవాలయాల్లో ఉప కార్యనిర్వహణాధికారులుగా డిప్యూటీ కమిషనర్లు వ్యవహరిస్తున్నారు. ఈవోలు అందుబాటులో లేనప్పుడు ఉప కార్యనిర్వహణాధికారి (డీఈవో) ఇన్‌ఛార్జి ఈవోగా వ్యవహరిస్తారని దేవాదాయశాఖ నుంచి మార్గదర్శకాలు ఉన్నాయి. వీటిని పట్టించుకోకుండా డీసీకి కిందిస్థాయి అధికారిని ఇన్‌ఛార్జి ఈవోగా పేర్కొనడంపై ఆలయ ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పవిత్రోత్సవం.. పరమపావనం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రహ్లాదవరదుని పవిత్రోత్సవాలు అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా సాగుతున్నాయి. పాడి పంటలతో సమస్త మానవాళి సుఖసంతోషాలతో జీవించాలని వేదపండితులు స్వామిని అర్చిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు హోమం నిర్వహించారు.



యాగశాలలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

పవిత్రమాలలతో స్వామి అమ్మవార్లు

భ్రమరాంబ దేవికి ఊయలసేవ

శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం భ్రమరాంబ దేవికి వైభవంగా ఊయలసేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శోభాయమానంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చి అర్చకులు త్రిశతి, ఖడ్గమాల సహస్రనామాలతో పూజలు జరిపారు.

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే:



స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేసిన అర్చకులు

చినుకు రాలింది.. రోడ్డు చెరువైంది

చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ చెరువులుగా మారుతున్నాయి. సరైన మురుగు కాలువల వ్యవస్థ లేకపోవడంతో నంద్యాల పట్టణంలో మోకాలి లోతు నీటిలోనే చోదకులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేట్, ప్రియాంకనగర్, పురపాలక కార్యాలయం తదితర ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం అరగంట పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాలువల్లో చెత్త, మురుగును తొలగించకపోవడంతో రోడ్లన్నీ చెరువులుగా మారాయి. మహిళలు, చిన్నారులు నడవడానికి అవస్థలు పడ్డారు.



సంజీవనగర్ గేట్‌లో రహదారిపై చేరిన నీరు



పురపాలక కార్యాలయం వద్ద రాకపోకలు

- జిల్లాలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు 116.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు నమోదైంది. బేతంచెర్ల, మిడ్తూరు, గోస్పాడు, కొత్తపల్లె, ఆత్మకూరు, అవుకు, రుద్రవరం, గడివేముల మండలాల్లో మినహా మిగిలిన గ్రామాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా కోవెలకుంట్లలో 19.2 మిల్లీమీటర్లు కురవగా, మహానంది 14.2, సంజామల 13.2, ఉయ్యాలవాడ 12.0, కొలిమిగుండ్ల 11.6, పాములపాడు 9.4, చాగలమర్రి 7.8, ఆళ్లగడ్డ 7.0, నంద్యాల 3.6, శ్రీశైలం 3.4, బండిఆత్మకూరు 3.2, నందికొట్కూరు 2.4, దొర్నిపాడు 2.0, శిరువెళ్ల 1.8, జూపాడుబంగ్లా 1.4, డోన్ 1.2, పాణ్యం 1.0, బనగానపల్లె 0.8, పగిడ్యాల 0.6, ప్యాపిలి 0.2 మిల్లీమీటర్లు నమోదైంది.

–న్యూస్‌టుడే, నంద్యాల వ్యవసాయం, నంద్యాల బొమ్మలసత్రం

వెలుగుల పండగకు చీకటి ఒప్పందాలు

■ అనుమతుల పేరిట పెత్తనం
■ ఒక్కో దుకాణం నుంచి రూ.38 వేలు

దీపావళి టపాసుల దుకాణాల ఏర్పాటులో కొందరు వసూళ్లకు తెర తీశారు. అనుమతులు మొదలు ఏర్పాటు వరకు అన్నీ తామే చూసుకుంటామని ఒక్కొక్కరి నుంచి రూ.38 వేల చొప్పున ఇవ్వాలని జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు నాయకులు డిమాండ్ చేస్తుండటం కలకలం రేపుతోంది. ఇప్పటికే ఓ నాయకుడు వ్యాపారులతో సమావేశమయ్యారు. సదరు వ్యక్తి గతంలో వైకాపాలో పెత్తనం చేశారు.. మళ్లీ అయనే చక్రం తిప్పుతుండటం గమనార్హం. రూ.38 వేలు అవసరం లేదు.. అంతకంటే తక్కువ ఇస్తే చాలు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటానని మరో నాయకుడు భరోసా ఇవ్వడం గమనార్హం.

నంద్యాల పురపాలకం, రైతునగరం, న్యూస్‌టుడే:

అధికారికంగా దేనికి ఎంత ఖర్చు (రూ.)



అగ్నిమాపక	550
రెవెన్యూ	550
పురపాలకం	550
జీఎస్టీ	550
విద్యుత్తు, నీరు, ఇతరత్రా	4000
మైదానం	1000
షెడ్డు నిర్మాణం	10,000

అక్రమ వసూళ్లు

ఏటా దీపావళి వేళ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. గత ఐదేళ్ల వైకాపా హయాంలో ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు వ్యాపారుల వద్ద డబ్బులు తీసుకొని ముందుండి నడిపించారు. ఒక్కో దుకాణం ఏర్పాటుకు రూ.30 వేల వరకు ఖర్చు అవుతుండగా రూ.10 వేలు అదనంగా వసూలు చేశారు. పెత్తనం చెలాయించిన ఓ వ్యక్తి ట్రేడ్ లైసెన్సు డబ్బును మున్సిపాలిటీకి చెల్లించకుండా చేతివాటం ప్రదర్శించారు. ఈ ఏడాదీ 80 నుంచి 90 దుకాణాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

వినియోగదారులపై భారం

దుకాణాల ఏర్పాటుకు చలానాలు, జీఎస్టీ, దుకాణాల నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల అనుమతులు, అధికారుల మామూళ్లు ఇలా ఒక్కో దుకాణం ఏర్పాటుకు సుమారు రూ.40 వేల వరకు ఖర్చవుతుండగా.. వాటికి రవాణా ఇతర ఖర్చులు కలపాల్సి ఉంటుంది. ఇవన్నీ వినియోగదారులే భరించాలి. ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో వెలుగుల పండగ ఎంతటిభారాన్ని మోపుతుందోనని ఇప్పటికే అందరిలో దిగులు మొదలైంది.

ఆర్టీసీకి దసరా ఆదాయం

కర్నూలు బి.క్యాంపు, నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఆర్టీసీ అధికారులు ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం విధించలేదు.. ప్రణాళికతో పండక్కి బస్సులు నడిపించారు. 'దసరా'కు రూ.10.9 లక్షల అదనపు ఆదాయానికి రాబట్టుకోగలిగారు.. కర్నూలు జిల్లా పరిధిలో గతేడాది రూ.7 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.7.2 లక్షలు, నంద్యాల జిల్లాలో గతేడాది రూ.3.6 లక్షలు ప్రస్తుతం రూ.3.7 లక్షల ఆదాయం వచ్చింది. దసరా నేపథ్యంలో అక్టోబరు 5 నుంచి 11 వరకు, 13 నుంచి 16 వరకు బస్సులు నడిపారు. హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, విజయవాడ, చెన్నై వంటి ప్రాంతాలకు 343 సర్వీసులను తిప్పారు. "ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు నడిపించాం.. గతేడాదితో పోలిస్తే స్వల్ప ఆదాయం పెరిగిందని" ఉమ్మడి జిల్లాల ప్రజారవాణాధికారులు శ్రీనివాసులు, రజియా సుల్తానాలు పేర్కొన్నారు.

డిపో	బస్సు సర్వీసులు	ఆదాయం (రూ.వేలల్లో)
ఆదోని	45	12.07
కర్నూలు-1	111	31.46
కర్నూలు-2	77	20.67
ఎమ్మిగనూరు	25	73.78
ఆళ్లగడ్డ	23	51.23
ఆత్మకూరు	15	35.90
బనగానపల్లి	14	35.89
డోన్	14	29.13
కోవెలకుంట్ల	23	53.43
నందికొట్కూరు	05	16.19
నంద్యాల	58	14.93

గొల్లలేరును ఆక్రమించారు

■ కుచించుకుపోతున్న వాగు

బనగానపల్లి, న్యూస్‌టుడే: గొల్లలేరు వాగు ఆక్రమణ రైతులకు శాపంగా మారింది. నీటిపారుదల శాఖ, ఎస్సార్బీసీ అధికారులకు మధ్య సమన్వయం కొరవడటంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు. ఏళ్లపాటు అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు ఎక్కువయ్యాయి. గొల్లలేరు 40 కి.మీ మేర విస్తరించి ఉంది. అవుకు జలాశయం గేట్లు ఎత్తిన సమయంలో నీరు ఈ వాగు ద్వారా వెళ్లి ఉయ్యాలవాడ మండలం అల్లూరు సమీపంలోని కుందూలో కలుస్తుంది. వాగు పరిధిలో ఐదువేల ఎకరాలకు పైగా సాగు భూమి ఉంది. అవుకు మండలం నిచ్చెనమెట్ల, అన్నవరం, గుండ్లశింగవరం, చిన్నకొట్టాల, శివవరం, సంజామల మండలం ఓ(త్రామాన్‌దిన్నె, సంజామల, కమలపురి, అల్లూరు తదితర గ్రామాల రైతులు వాగు ఆధారిత నీటితో పంటలు సాగు చేసుకొంటారు. అధికారుల పర్యవేక్షణ కొరవడంతో చాలా వరకు ఆక్రమణకు గురైంది.. అదేవిధంగా వాగులో పూడిక పేరుకుపోవడంతో వరద పోటెత్తి పొలాలను ముంచుతోంది. ఏటా సుమారు వెయ్యి ఎకరాల వరకు నీట మునుగుతోంది.



కుచించుకుపోయిన గొల్లలేరు వాగు

ఉన్నతాధికారుల దృష్టికి

–రామ్మోహన్‌రెడ్డి, ఏఈ, మైనర్ ఇరిగేషన్ శాఖ

గతంలో గొల్లలేరు వాగు పనుల్ని ఎస్సార్బీసీ అధికారులు చేసేవారు. దీంతో తమకు పూర్తి స్థాయి పర్యవేక్షణ లేకపోయింది. ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేసి వాగుకు కొలతలు వేయించే కార్యక్రమాన్ని చేపడతాం. ఆక్రమించి ఉంటే చర్యలు తీసుకుంటాం.

కొరవడిన సమన్వయం

- అవుకు జలాశయం గేట్లు ఎత్తితే వాగులో నీటి ఉద్ధృతి పెరిగి పొలాలను ముంచెత్తుతోంది. వాగుకు ఇరువైపులా సుమారు రూ.2 కోట్ల వరకు ఖర్చు చేసి పూడిక తొలగించారు. సుమారు 10 కి.మీ. వరకు పనులు చేసి నిలిపేశారు. ఇంతటితో మాపని అయిపోయిందని ఎస్సార్బీసీ అధికారులు పట్టించుకోవడం లేదు.
- పూడిక తీసి కట్టలు వేసిన చోట కొందరు రైతులు వాటిని చదును చేసి పొలాలు సాగు చేసుకోగా ఇంకొందరు వాగును ఆక్రమించి నీరు వెళ్లకుండా చేస్తున్నారు.
- నిబంధనల ప్రకారం వాగులు, వంకలు మైనర్ ఇరిగేషన్ పరిధిలోకే వస్తాయి. పూడిక తీత పనులు ఎస్సార్బీసీ అధికారులు చేయడంతో మైనర్ ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. పూడిక తీత పనులు చేసిన ఎస్సార్బీసీ అధికారులు తమ పని అయిపోయిందని వాగుపై పర్యవేక్షణ వహించకపోవడం, ఎవరికి వారు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు ఎక్కువవుతున్నాయి.

టెట్‌కు 36 మంది గైర్హాజరు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 36 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఉదయం 160 మంది అభ్యర్థులకు 134, మధ్యాహ్నం 60 మందికి 50 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడి బదిలీ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పురుష ఉపాధ్యాయులను బదిలీ చేయాలని 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. రెండు రోజుల కిందట బదిలీపై వచ్చిన ఉపాధ్యాయున్ని రిలీవ్ చేసి వెనక్కి పంపినట్లు ప్రిన్సిపల్ రేహామతి తెలిపారు. ఇతర ఉపాధ్యాయుల విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పుర పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత లేకుండా అర్హులకు పదోన్నతులు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ ప్రసాద్, జె.సుధాకర్ డిమాండు చేశారు. శుక్రవారం స్థానిక డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో పుర ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని యాజమాన్య పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ అయినా పుర పాఠశాలల్లో జరగలేదన్నారు. పుర ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. బదిలీలు చేపట్టాలన్నారు. రామ్మోహన్, రామకృష్ణుడు, అరవిందకుమార్, ఖాసీం, రాంనాయక్, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పల్లె క్రీడాకారులు..

◆ ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు

పతకాల సాధకులు



కోసిగి, న్యూస్‌టుడే: గ్రామీణ విద్యార్థులు వివిధ క్రీడల్లో విజయాలు సాధిస్తూ పతకాలు సొంతం చేసుకుంటున్నారు. కోసిగి మండలం వందగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. ఇక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోయినా అదే గ్రామానికి చెందిన ధర్మరాజు అనే యువకుడి వద్ద శిక్షణ పొందుతూ మెలకువలు నేర్చుకుంటూ సత్తా చాటుతున్నారు.

రాష్ట్ర స్థాయిలో పతకం సాధించా: మౌనేష్



నేను తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. మా అమ్మానాన్నలు వ్యవసాయ పనులు చేస్తారు. 6వ తరగతి చదువుతున్నప్పటి నుంచి ఖోఖో క్రీడపై ఆసక్తి పెంచుకున్నా. 2020లో శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో పతకం సాధించా. 2021లో విశాఖపట్నంలో అండర్-14 విభాగం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రన్నరప్‌గా నిలిచి కప్ అందుకున్నా. 2023లో తూర్పుగోదావరిలో నిర్వహించిన అండర్-17 రాష్ట్ర పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చా. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రాష్ట్ర పోటీల్లో ప్రత్యేక ఆటతీరుతో పతకం అందుకున్నా.

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం: రమేష్



నేను వైఎస్సార్ జిల్లా రాయచోటిలో టీటీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. మా అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సొంతూరు వందగల్లులోనే చదివాను. నాకు చిన్నతనం నుంచి ఖోఖో క్రీడ అంటే ఎంతో ఆసక్తి. 2022లో ఆత్మకూరులో నిర్వహించిన అండర్-18 విభాగంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో తృతీయ బహుమతి సాధించాను. విజయనగరంలో జరిగిన అండర్-19 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచా. 2023లో చిత్తూరులో అండర్-18 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరుగైన ప్రదర్శన ఇవ్వడంతో జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆళ్లగడ్డలో రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో జరిగిన జాతీయ పోటీల్లో పతకం సాధించాను. తిరుపతిలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ రాష్ట్ర పోటీల్లో పతకాలు అందుకున్నాను. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

జాతీయ ఫుట్‌బాల్‌లో గోల్ చేశా: సుప్రియ



నేను కడప స్పోర్ట్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నా. మా నాన్న సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. 1 నుంచి 6వ తరగతి వరకు వందగల్లు గ్రామంలోనే చదివాను. 6వ తరగతిలో వైఎస్సార్ జిల్లా స్పోర్ట్స్ పాఠశాలలో సీటు రావడంతో అక్కడే విద్యాభ్యాసం చేస్తున్నాను. నాకు చిన్నతనం నుంచి ఫుట్‌బాల్ ఆటంటే ఎంతో ఆసక్తి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో ఫుట్‌బాల్ నేర్చుకున్నా. 2023లో జార్ఖండ్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జాతీయ పోటీల్లో పాల్గొని గోల్ చేశాను. 2024లో మధ్యప్రదేశ్‌లో జరిగిన సబ్ జూనియర్ జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని గోల్ చేసి పతకం సాధించాను. క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదిగి ఉద్యోగం సాధించాలన్నది నా ఆశయం.

ఒక్కగేటు ద్వారా నీరు విడుదల

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్ట్‌గేటును అధికారులు శుక్రవారం ఎత్తారు. పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ఒక్క రేడియల్ క్రస్ట్‌గేటును 10 అడుగుల మేర పైకి ఎత్తి 27,891 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 67,862 క్యూసెక్కులను అదనంగా నాగార్జునసాగరుకు విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి 1,22,634 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి 884.60 అడుగులు, నీటినిల్వ 213.4011 టీఎంసీలుగా నమోదైంది. ఈ సీజన్‌లో రేడియల్ క్రస్ట్‌గేట్లను ఎత్తడం ఇది ఐదోసారి.



జలాశయం ఎదుట సందర్శకులు

సందర్శకుల సందడి

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం ఎదుట సందర్శకులు శుక్రవారం సందడి చేశారు. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్ట్‌గేట్‌ను 10 అడుగుల మేరపైకి ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం శ్రీశైలం జలాశయానికి చేరుకొని దిగువ విడుదలయ్యే నీటి ప్రవాహాన్ని తిలకిస్తూ స్వీయచిత్రాలతో సందడి చేశారు.

20న జిల్లా చెస్ జట్టు ఎంపిక పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న శాంతినికేతన్ పాఠశాలలో జిల్లా రాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో చదరంగం జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. రవికృష్ణ, రామసుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల్లో ఎంపికైన జట్టు పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలో జరిగే రాష్ట్ర చదరంగం పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఉప్పొంగిన పాలేరు వాగు.. విద్యార్థుల అవస్థలు



అల్పపీడనం కారణంగా శుక్రవారం కురిసిన వర్షానికి పాలేరు వాగు ఉప్పొంగింది. సంజామల సమీపంలోని వంతెనపై నుంచి వరద ప్రవహించింది. దీంతో సంజామల- కానాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోవెలకుంట్లలో పాఠశాల, కళాశాలలకు వెళ్లిన విద్యార్థులు ఇళ్లకు చేరుకోవడానికి అవస్థలు పడ్డారు. కొందరు విద్యార్థులు సాహసం చేసి పాలేరువాగును దాటి గ్రామాలకు చేరుకున్నారు. విద్యార్థులు క్షేమంగా ఇంటికి చేరుకోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పాలేరు వాగు ఉప్పొంగి ప్రవహించటంతో పరీవాహక ప్రాంతంలోని వందలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మిరప, మినుము తదితర పంటలు నీట మునిగాయి. –న్యూస్‌టుడే, సంజామల

గుంతల దారిలో ప్రయాణికుల అవస్థలు



ఎడతెరిపి లేకుండా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోవెలకుంట్ల- జమ్మలమడుగు రహదారి ఛిద్రమై దారుణంగా మారింది. కంకర లేచి గుంతలు పడ్డాయి. ఉయ్యాలవాడ మండలం మాయలూరు-గోవిందపల్లె మెట్ట వరకు రెండు కి.మీ. రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. వాహనదారులు ఈ దారి రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


–న్యూస్‌టుడే, మాయలూరు (ఉయ్యాలవాడ)

లెక్కుంది.. మొక్క లేదు

◆ పాదుల్లో రూ.కోట్ల ప్రజాధనం

◆ కనిపించని పచ్చతోరణం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: లెక్క రూ.కోట్లల్లో ఉంది.. నాటిన మొక్క మాత్రం మాయమైంది. ప్రజాధనం 'చెట్లపాలైంది'. మొక్కలు నాటుతూ సంబరాలు చేశారు. వాటి సంరక్షణ మాత్రం గాలికొదిలేశారు. మొక్కల పేరు చెప్పి.. రూ.కోట్లు దండుకున్నారు. జిల్లాలో గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన జగనన్న పచ్చతోరణం గుత్తేదారులకు, అధికారులకు కాసులు కురిపించింది తప్ప ముచ్చుకైనా ఒక్క మొక్క కూడా చెట్టులా మారిన దాఖలాలు లేవు. 2020-21, 2021-22, 2022-23 వరకు మూడేళ్ల పాటు లక్షల సంఖ్యలో మొక్కలు నాటినా.. లక్ష్యం మాత్రం నెరవేరలేదు.. రూ.కోట్లతో జేబులు నింపుకొన్నారు.



వైకాపా నాయకులే గుత్తేదారులు

జిల్లాలో గత వైకాపా ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం పథకం పేరుతో చెట్ల పెంపకానికి తెరపైకి తెచ్చింది. అటవీశాఖ, జిల్లా నీటియాజమాన్య సంస్థ(డ్వామా) ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఇందులో చాలా వరకు వైకాపా నాయకులే గుత్తేదారులుగా మారి, మొక్కలు నాటకుండానే.. లెక్కలు మేసేశారు. పెంచకుండానే పెంచినట్లు చూపారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధులు పక్కదారి పట్టినా అప్పటి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో జగనన్న పచ్చతోరణం అక్రమాలకు నిలయంగా మారింది.



☛ ఆలూరు నుంచి కరిగుడ్డంకు వెళ్లే రహదారి ఇది. ఇక్కడ గతంలో రోడ్డుకు ఇరువైపులా 8 కి.మీ. మేర మొక్కలు నాటారు. ప్రస్తుతం అటువైపుగా వెళ్తే.. మచ్చుకైనా ఒక్క మొక్క కూడా కనిపించడంలేదు. 2020-21 సంవత్సరంలో ఆలూరు మండలంలో 18 పనులకు గాను 6,165 మొక్కలు నాటారు. ఇందు కోసం రూ. 12,78,127.80 ఖర్చుచేశారు. కానీ నాటిన వాటిలో ఏ మొక్క కనిపించని పరిస్థితి.

కొరవడిన సంరక్షణ

జిల్లాలో 2019-23 మధ్య అన్ని మండలాల్లో పథకం అమలు చేశారు. ఆరడగుల ఎత్తు, రెండేళ్ల వయసున్న మొక్కలే నాటాలని సూచించింది. కానీ ఎక్కడా అవి అమలుకాలేదు. మూడేళ్ల కాలంలో సుమారు ఐదు లక్షల మొక్కలు నాటామని, వాటి సంరక్షణకు రూ.కోట్లు వెచ్చించినట్లు చెబుతున్నారు. వాస్తవానికి నిర్వహణ సరిగా చేపడితే 80 శాతం పైగా మొక్కలు బతకాలి. మొక్కల కొనుగోలు, ట్రీ గార్డులు, వాటి సంరక్షణకు ఏటా సుమారు రూ. 3 కోట్లు ఖర్చు చేశారని కొంత మంది అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధ చట్టంలోని నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆమె గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధ చట్టం అమలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 125 అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల్లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి, నిషేధ చట్టం నిబంధనలు అందరికీ అర్థం అయ్యేలా ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే మూడేళ్ల జైలుతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తారన్నారు. వైద్యులు అతిక్రమిస్తే వారి లైసెన్సును రద్దు చేయనున్నట్లు ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని 145 ప్రైవేటు ఆసుపత్రులతో పాటు 82 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్ని అబార్షన్లు జరిగాయి, కారణాలు ఏమిటి? తదితర వివరాలు తనకు అందజేయాలన్నారు. జిల్లాలో పురుష, మహిళల నిష్పత్తి తక్కువగా ఉందన్నారు. ఇందుకు సంబంధించిన విశ్లేషణాత్మక నివేదిక ఇవ్వాలన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

ఆస్ట్రేలియా తెలుగు ప్రజల ఆదరణ మరువలేనిది: శబరి


నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో తెలుగు ప్రజలు ఇచ్చిన ఆతిథ్యం, వారు చూపిన ఆదరణ మరువలేనిదని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి పేర్కొన్నారు. శుక్రవారం ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ తెలుగు ప్రజలు లగడపాటి సుబ్బారావు, గోపి నంబాల, కె.శ్రీకాంత్, తాతిన సుమ, దాసరి సుమన్, సూరపనేని ప్రకాశ్, జొన్నలగడ్డ నర్మద, విష్ణ నితిన్ తదితరులు కలిసి ఎంపీ శబరి ఆమె భర్త డా.శివచరణ్‌రెడ్డిలకు ఆతిథ్యం ఇచ్చారు. ఈ మేరకు వివరాలను ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ప్రభుత్వ విజయానికి కృషి చేసిన వారికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మీ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన ఉందని, ఎంపీగా తన బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.



ఆస్ట్రేలియాలోని తెలుగు వారితో ఎంపీ

విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపైన విద్యుత్తు భారాలు మోపకుండా తగ్గించాలని సీపీఎం రాష్ట్ర నాయకులు ముజఫర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యుడు నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని విద్యుత్తు శాఖ ఈఈ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం విద్యుత్తు శాఖ ఈఈ శ్రీనివాసరెడ్డికి సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రూఅప్ పేరిట విద్యుత్తు ఛార్జీలను పెంచి రాష్ట్ర ప్రజలపై రూ. 20వేల కోట్ల భారం వేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. తోట మద్దులు, కేఎండీ గౌస్, పుల్లా నరసింహులు, లక్ష్మణ్, వెంకటలింగం, శివ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నవంబరు 10 నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ

రాయచోటి, న్యూస్‌టుడే: వైఎస్సార్ జిల్లా కడప డీఎస్‌ఏ స్టేడియంలో నవంబరు 10 నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ నిర్వహిస్తున్నామని ఆర్మీ నియామక అధికారి కల్నల్ పునీత్‌కుమార్ పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్మెన్‌ల నియామకానికి దరఖాస్తులు చేసి అడ్మిట్ కార్డులు పొందిన కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నంద్యాల, బాపట్ల, పల్నాడు, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అర్హులైన అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఎవరు దళారులను నమ్మి మోసపోకూడదని వివరించారు.

ఉన్నత లక్ష్యాలు చేరుకుని ఆదర్శంగా నిలవాలి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: హోంగార్డు కుటుంబాల పిల్లలు బాగా చదివి భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలవాలని ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో 2023-24 ఏడాదిలో పదో తరగతి, ఇంటర్ పరీక్షలలో 80 శాతం కంటే ఎక్కువ శాతం ప్రతిభ కనబరిచిన 26 మందిలో కొందరికి రూ. 2వేలు, మరి కొందరికి రూ.వెయ్యి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా హోంగార్డ్స్ వెల్ఫేర్ ఫండ్ నుంచి చెక్కులను అందజేసినట్లు చెప్పారు. హోంగార్డు కమాండెంట్ మహేశ్‌కుమార్, ఏఎస్పీ యుగంధర్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు నాగభూషణం, మంజునాథ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

హోంగార్డు కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అనారోగ్య కారణాలతో మృతిచెందిన హోంగార్డు సేవల్ని కొనియాడుతూ బాధిత కుటుంబ సభ్యులకు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో రూ. 2లక్షల చెక్కును అందజేశారు. నంద్యాల జిల్లాలో పని చేస్తున్న ఎస్ఎండీ హుసేన్ అనారోగ్యంతో మృతి చెందగా, ఉమ్మడి జిల్లాల హోంగార్డ్స్ అందరూ కలిసి పోగు చేసిన రూ.2 లక్షల చెక్కును మృతుడి భార్య షేక్ షహీనాకు ఎస్పీ అందజేశారు.

బండరాయితో మోది కోడలి దారుణ హత్య

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బండరాయితో మోది కోడల్ని దారుణ హత్య చేసిన సంఘటన నందికొట్కూరు మండలం నాగటూరులో శుక్రవారం జరిగిందని పోలీసులు వివరాలు తెలిపారు. నాగటూరుకు చెందిన నరసింహ, మండ్లెంకు చెందిన శిరీష(26)కు 12 సంవత్సరాల కిందట వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త నరసింహ చెడు వ్యసనాలకు బానిసవ్వడంతో తరచూ గొడవలు జరిగేవి. పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగేవి. భర్త కాలుకు గాయమవ్వడంతో ఆయన ఇంటి వద్దే ఉంటున్నారు. శుక్రవారం అత్త మల్లీశ్వరి, మామ కురుమన్నలతో కలిసి పొలానికి శిరీష వెళ్లారు. అత్త మల్లీశ్వరి పొలం సమీపాన ఆరబెట్టిన మొక్కజొన్నల వద్ద ఉండగా కోడలితో కలసి మామ మొక్కజొన్న కంకులు ఏరేందుకు వెళ్లారు. కోడలిపై అత్యాచారయత్నానికి మామ ప్రయత్నించడం, ఆమె తిరస్కరించడంతో బండారాయితో మోది అతికిరాతకంగా హత్య చేశాడని బంధువులు ఆరోపిస్తున్నారు. గతంలో గ్రామంలో ఓ మైనర్‌పై కూడా ఆయన అత్యాచారయత్నానికి పాల్పడి జైలుకు వెళ్లినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. తమకు న్యాయం చేసేంతవరకు పొలంలో మృతదేహాన్ని కదలనీయబోమని బంధువులు అడ్డుకోవడంతో సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్సై లక్ష్మీనారాయణ వారికి న్యాయం చేస్తామని సర్దిచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టానికి నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి అన్న అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



శిరీష (పాత చిత్రం)

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో నవంబరు 11న నిర్వహించే మైనార్టీల సంక్షేమ దినోత్సవం రోజు అందించే పురస్కారాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద సబిహా పర్వీన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఏడాది ఆజాద్ జయంతిని ప్రభుత్వం జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుతున్నట్లు తెలిపారు. ఉర్దూ అభివృద్ధి, సాహిత్య, విభిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారికి జాతీయస్థాయి పురస్కారం (రూ, 1,25,000 ప్రోత్సాహకం, సర్టిఫికెట్, జ్ఞాపిక), ప్రాంతీయ స్థాయి పురస్కారం (రూ.లక్ష ప్రోత్సాహకం, సర్టిఫికెట్, జ్ఞాపిక) అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి చెందిన ఉర్దూ సాహితీవేత్తలకు, పండితులకు, కవులకు, పాత్రికేయులకు, విమర్శ, పరిశోధన, గద్యబోధన, ఉర్దూ సేవకులకు వివిధ విభాగాల్లో సేవలు అందించిన ఆరుగురికి జీవితకాల సాఫల్య పురస్కారాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఉర్దూ భాషాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, ఉర్దూలో అత్యున్నత శ్రేణిలో రాణించిన విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసే వారు ఈ నెల 25లోపు డా. మహమ్మద్ మస్తాన్, డైరెక్టర్, ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమి, డోర్‌నెం. 76-1-6ఏ/1,2, మాలవికా విల్లా, హెచ్‌బీ కాలనీ, భవానిపురం, విజయవాడ చిరునామాకు పంపించాలన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

☛ టమాట డబ్బాల చాటున తరలింపు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: టమాట డబ్బాల చాటున బొలెరో వాహనంలో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డోన్ వైయస్ నగర్‌కు చెందిన షేక్ దస్తగిరి, తుగ్గలి మండలం గిడిసేగుప్పరాళ్ళ గ్రామానికి చెందిన సురేంద్రగౌడ్, తుగ్గలికి చెందిన మణికంఠగౌడ్, కృష్ణగిరి మండలం సంగాల గ్రామానికి చెందిన హరిప్రకాశ్‌గౌడ్ కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్లను బొలెరో వాహనంలో తీసుకుని వచ్చి స్థానిక గ్రామాల్లో విక్రయిస్తుంటారని పేర్కొన్నారు. కర్నూలు నుంచి డోన్ వైపు టమాట డబ్బాలతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు వైయస్‌నగర్‌లో తనిఖీ చేయగా 80 డబ్బాల్లో 7,680 టెట్రా ప్యాకెట్లు, 700 లీటర్ల కర్ణాటక మద్యాన్ని గుర్తించినట్లు చెప్పారు. వీటి విలువ రూ.4 లక్షలు ఉంటుందన్నారు. వాహనాన్ని, మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను విచారిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్సై శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యాన్ని, నిందితులను చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు,సీఐ,ఎస్సైలు

శవమై తేలిన సిద్ధార్థ

మహానంది, న్యూస్‌టుడే: మహానంది ఈశ్వరనగర్‌కు చెందిన మాఘం గౌతమ్ సిద్ధార్థ(17) బుధవారం గల్లంతై శుక్రవారం రుద్రవరం మండలంలోని గండ్లేరు రిజర్వాయర్‌లో శవమై తేలాడు. అక్కడ చెంచులు గాలించడంతో మృతదేహం ఉబ్బిపోయిందని మహానంది ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి వివరాలు తెలిపారు. మేకలను మేపేందుకు తన మిత్రునితో కలిసి వెళ్లిన సిద్ధార్థ తెలుగుగంగలో ఈతకు దిగి గల్లంతయ్యాడు. మృతుడి తల్లి మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించామని చెప్పారు.

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

ఆసుపత్రిలో సిబ్బందిని భర్తీ చేయండి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల సర్వజన ఆసుపత్రిలోని వివిధ కేటగిరీలకు సంబంధించిన పోస్టుల్ని భర్తీ చేసి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప డిమాండు చేశారు. శుక్రవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఎం. డి. జిలానీని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించారు. జిల్లా కార్యదర్శి ఎస్. తిరుపాలయ్య, జిల్లా సహాధ్యక్షుడు శ్రీహరి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, సభ్యులు జగదీశ్వరప్ప, ఫక్రుద్దీన్, డేవిడ్ సుందరం పాల్గొన్నారు.


సూపరింటెండెంట్‌ను కలిసిన ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు

19, 20 తేదీల్లో అవగాహన సదస్సు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఈ నెల 19, 20 తేదీల్లో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించే వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని ఆ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహమ్మద్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్, ఆటో-ట్రాలీ, ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత న్యాయ సంహిత చట్టం 106(1), (2)ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు కనీస వేతనం అమలయ్యేలా యజమానులపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఎల్లయ్య, లక్ష్మణ్, రమేష్ బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అహమ్మద్

క్రీడా సమాఖ్య కార్యదర్శి శివకుమార్ తొలగింపు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి శివకుమార్‌ను ఆ పదవి నుంచి తొలగిస్తూ డీఈవో సుధాకర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో నందికొట్కూరు జడ్పీ బాలుర పాఠశాలలో పనిచేస్తున్న శ్రీనాథ్‌కు జిల్లా క్రీడా పోటీల సమాఖ్య కార్యదర్శిగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎప్పుడేం జరుగుతుందో..?

మహానంది మండల కేంద్రం ఎం. తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలోని కొన్ని తరగతి గదులు వర్షాలకు కారిపోతున్నాయి. విద్యార్థులు చదువుకోవడానికి, ఉపాధ్యాయులు పాఠాలు బోధించడానికి ఇబ్బందులుపడుతున్నారు. ఏమైనా ప్రమాదాలు జరగకముందే తగిన చర్యలు తీసుకొని వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, తిమ్మాపురం, (మహానంది)



రాకపోకలకు ఆటంకాలు

గోపవరం (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం గోపవరం సమీపంలోని నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిపై ఓ వృక్షం శుక్రవారం పడిపోవడంతో రాకపోకలకు జనాలు ఇక్కట్లపాలయ్యారు. ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చెట్టు పడిపోయింది. గ్రామస్థులు చెట్లకొమ్మలను నరికేసి, వాహనాల రాకపోకలకు అనువుగా మార్చారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: డీ2 పరిధిలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని డీ2 ఏఈ రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఎన్జీవోస్ కాలనీ, ఎస్బీఐ కాలనీ, సాయిబాబానగర్, గిరినాథ్ సెంటర్, వీసీ కాలనీ, దేవనగర్, పద్మావతి నగర్‌లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

పాణ్యం గ్రామీణం: **ప్రశ్న:** భూపనపాడు గ్రామంలో తాగునీరిందించే చేతిపంపు చుట్టూ గడ్డి పెరిగింది.- రవి.

ప్రశ్న: మద్దూరు ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి బురదమయంగా మారుతోంది. **-ప్రకాశ్**

సమాధానం: భూపనపాడులో చేతిపంపును పరిశీలించి నీరు కలుషితం కాకుండా ఏర్పాట్లు చేస్తాం. మద్దూరుతో పాటు అన్ని గ్రామాల్లో సీసీ రహదార్లు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

-ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, పాణ్యం.

పగిడ్యాల: **సమస్య:** మండలంలోని కుంట కాలనీ వీధులు అపరిశుభ్రంగా మారాయి. **- మధు.**

సమాధానం: తొలగింపు చర్యలు చేపడతాం.

-పెరుమాళ్ళు శేషన్న, సర్పంచి.

సమస్య: నెహ్రూనగర్, నుంచి నందికొట్కూరుకు వెళ్లే రోడ్డులో పొదలను తొలగించాలి. **- రవి యాదవ్.**

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం.

- సుమిత్రమ్మ, ఎంపీడీవో.

స్తంభం ఒరిగింది.. ఆందోళన పెరిగింది


డేనియల్‌పురంలో ప్రమాదకరంగా ఒరిగిన విద్యుత్తు స్తంభం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారడంతో స్థానికుల్లో ఆందోళన ఎక్కువవుతోంది. ఇటీవల వర్షాలు కురుస్తున్నందున ఇవి ఎప్పుడు కూలి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. చాలా విద్యుత్తు నియంత్రికలకు రక్షణ గోడలు గాని కంచెలు గాని లేవు. ఇంకొన్ని తక్కువ ఎత్తులో ఉన్నాయి. పొరపాటున వాటిని తగిలితే ప్రాణాలకే ప్రమాదమైనా విద్యుత్తు శాఖ అధికారులు ఒరిగిన వాటిని సరిచేయడం కానీ వాటిస్థానంలో కొత్తవి గానీ ఏర్పాటు చేయడం లేదు. విద్యుత్తు నియంత్రికలకు రక్షణ గోడలు లేదా కంచెలు ఏర్పాటు చేస్తామని చెబుతున్నా ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. ఇంకొన్ని చోట్ల విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నా వాటిని అధికారులు సరిచేయలేదు. ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకొని సమస్యల్ని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


కాంతినగర్‌లో ఒరిగిన విద్యుత్తు స్తంభాలు

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..?

☛ నంద్యాల పట్టణంలోని డేనియల్‌పురంలో విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉంది. ఇది ఎప్పుడు విరిగి పడి ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

☛ కాంతినగర్‌లో చాలా కాలం నుంచి ఇవి ఒరిగి ఉన్నా వాటిని బాగు చేయలేదు. ఆయా స్తంభాలు కూలి ప్రమాదం జరగకముందే సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

☛ బొగ్గులైన్ ప్రాంతంలో విద్యుత్తు నియంత్రికలు జనావాసాల మధ్యనే ఉన్నాయి. వీటికి ఎటువంటి రక్షణ గోడలు కాని కంచెలు కానీ ఏర్పాటు చేయకపోవడంతో జనం భయం భయంగా జీవనం సాగిస్తున్నారు. విద్యుత్తు నియంత్రికలకు రక్షణ కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

☛ జ్ఞానాపురంలో ప్రధాన రహదారి పక్కనే విద్యుత్తు నియంత్రికలకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయలేదు. ఈ రహదారి గుండా నిత్యం వేల మంది విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్తు నియంత్రికకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

☛ పట్టణంలోని బర్మశాల వీధిలో విద్యుత్తు తీగలు కిందకి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ దారిలో ఏదైనా ఎత్తైన వాహనం వెళ్తే తీగలు తగిలి విద్యుత్తు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కిందకి వేలాడుతున్న విద్యుత్తు తీగలను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ సౌత్‌జోన్ క్రీడలకు పయనం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ సౌత్‌జోన్ క్రీడా పోటీలకు శాంతిరాం ఇంజినీరింగ్ సీఎస్ఈ విద్యార్థి శరత్ చంద్రారెడ్డి, ఆర్జీఎం ఈసీఈ విద్యార్థి వేణు ఎంపికైనట్లు ప్రిన్సిపాళ్లు సుబ్రహ్మణ్యం, జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో వారిని అభినందించారు. డిసెంబరులో అలగప్ప విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ సౌత్‌జోన్ విశ్వవిద్యాలయ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. విభాగాధిపతి ఫారూఖ్, పీడీలు చంద్రారెడ్డి, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.


శరత్‌చంద్రారెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మహానంది, న్యూస్‌టుడే: తుపాను వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెదేపా నాయకుడు వంగల మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మహానంది మండలం నందిపల్లె రైతులు సాగుచేసిన పంటలు పడిపోవడంతో శుక్రవారం పరిశీలించారు. నక్క చెన్నయ్య, పరమేష్, నరసింహుడుతో పాటు రైతులు అధికారులు తమ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని సాయం అందించాలని కోరారు.


మహానంది: పొలాలను పరిశీలిస్తున్న తెదేపా నాయకులు, రైతులు

అనుమతులు లేని బయో ఎరువులు విక్రయిస్తే చర్యలు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అనుమతులు లేని బయో ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణా హెచ్చరించారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని బావాపురంలోని జేసీ అగ్రిబయోటిక్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. దస్త్రాలు, ఎరువులను పరిశీలించారు. ఆయా మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.


ఎరువుల తయారీని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

మద్యం దుకాణాల ఏర్పాటుపై ఆందోళన

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యం మండలంలో మద్యం దుకాణాల ఏర్పాటు వివాదంగా మారింది. మండల కేంద్రం పాణ్యం బస్టాండ్ సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయం, అగ్రిల్యాబ్ పక్కనే మద్యం దుకాణం ప్రారంభించడంతో స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయానికి మహిళలు, విద్యార్థులు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. బలపనూరు మెట్ట సమీపంలో కౌలూరు రహదారిలో మరో మద్యం దుకాణం ఏర్పాటు కూడా వివాదాస్పదమైంది. నంద్యాలకు చెందిన మరో మద్యం దుకాణం పాణ్యం మండలం తొగర్చేడు గ్రామ సమీపంలో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేయడంపై తొగర్చేడు గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది గ్రామ పంచాయతీ మహానందీశ్వరనగర్ లోని కాశినాయన ఆశ్రమం సమీపంలో దేవునికిచ్చిన స్థలాన్ని ఆక్రమించారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆ స్థలంలో నాగదేవత విగ్రహాలకు పూజలు జరిగేవని గ్రామస్థులు చెబుతుండటంతో ఎస్సై ఎన్. రామమోహన్ రెడ్డి విచారణ చేపట్టారు. సమస్యను పరిష్కరిస్తామని ఎస్సై తెలిపారు.


చెల్లాచెదురుగా విగ్రహాలు

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులపై మోపుతున్న ట్రూ అప్ ఛార్జీల అదనపు భారాన్ని రద్దు చేయాలని సీపీఎం నాయకుడు పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఏడీఏ కార్యాలయం వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. వైకాపా పాలనలో విద్యుత్తు ఛార్జీల బాదుడే బాదుడు అన్న కూటమి ప్రభుత్వం కూడా నేడు వినియోగదారులపై ఛార్జీల మోత మోగిస్తోందన్నారు. అనంతరం ఏడీఏ శ్రీనివాసులుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. గోపాలకృష్ణ, బాబు, జావీద్, గణేష్, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.


ఏడీఏకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనను ఉప సంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మకూరు విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేసి విద్యుత్తు శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మోపిన విద్యుత్తు ఛార్జీలను తగ్గిస్తామని, వాటిని పెంచబోమని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్దానం చేసిందన్నారు. విద్యుత్తు మోటార్లకు మీటర్లు రద్దు చేయాలన్నారు. విద్యుత్తు భారాన్ని సర్దుబాటు పేరుతో జనంపై మోపొద్దన్నారు. రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావ్, దినేష్, సద్దాంహుస్సేన్, సుధాకర్, రవీంద్ర, పక్కీరయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

నీటిని సరఫరా చేయాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: వివిధ కాలనీల ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పురపాలక కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ సెక్షన్ ఏఈ మనోజ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ట్యాంకులను శుభ్రం చేయించి బ్లీచింగ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, ఉపేంద్ర, బాషా పాల్గొన్నారు.

సీరత్ క్విజ్ టాలెంట్ పోటీల విజేతలు వీరే!

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: సీరత్ క్విజ్ టాలెంట్ టెస్ట్ పోటీల విజేతలను ప్రకటించారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా చేతుల మీదుగా శుక్రవారం నిర్వాహకులు పేర్లు ప్రకటించారు. జమాన్ ఫౌండేషన్ కన్వీనరు నవ భారత్ హుస్సేన్ మాట్లాడుతూ మొదటి బహుమతి రూ.10 వేల నగదుకు 98 మంది విద్యార్థులు, ద్వితీయ బహుమతి రూ.5 వేల నగదుకు 110 మంది, తృతీయ బహుమతి రూ.3 వేలకు 328 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తెలిపారు. విజేతలకు ఈ నెల 24 న నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు సలాముల్లా, ఖాజా, అజీజ్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.


విజేతల వివరాలు ప్రకటిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

ఉపాధ్యాయులను నియమించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించి గిరిజన విద్యాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఒకటి నుంచి పది వరకు 87 మంది విద్యార్థులు చదువుతుండగా.. కేవలం ఒకే ఒక ఉపాధ్యాయిని ఉన్నారని తెలిపారు. కొత్తపల్లి మండలం శివపురం ఆశ్రమ పాఠశాలలో 145 మంది చదువుతున్నారని, ఇంగ్లిష్, హిందీ, సాంఘిక శాస్త్రం, గణితం బోధించేందుకు సబ్జెక్టు ఉపాధ్యాయులు లేరన్నారు.

ధ్రువీకరణ పత్రాలతో హాజరవ్వాలి

నంద్యాల పట్టణం: జిల్లాలోని కేజీబీవీల్లో వివిధ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల అర్హత ధ్రువీకరణ పత్రాలను శనివారం పరిశీలిస్తున్నట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక సీఎస్ఐ చర్చి వెనుక హోలిక్రాస్ బాలికల హైస్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు తమ అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరవ్వాలని, గెజిటెడ్ అధికారి సంతకం చేసిన రెండు సెట్ల జిరాక్స్ కాపీలను అందజేయాలని కోరారు.

తిమ్మాపురం(మహానంది), న్యూస్‌టుడే: గ్రామ స్వపరిపాలనా విధానాలు ప్రజాభివృద్ధికి మార్గాలని ఎంపీడీవో మహబూబ్‌దౌలా పేర్కొన్నారు. మహానంది మండల కేంద్రం ఎం. తిమ్మాపురంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండురోజుల పాటు శిక్షణ ప్రారంభించి మాట్లాడారు.

పగిడ్యాల: ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్పంచులకు, ఉప సర్పంచులకు వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులు జడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య, ఎంపీడీవో సుమిత్రమ్మ ప్రారంభించారు. ఈవోపీఆర్డీ నాగేంద్రయ్య, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎరువులు, పురుగు మందుల డీలర్లు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, సహాయ వ్యవసాయ సంచాలకుడు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఆత్మకూరులోని మల్లికార్జున ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నల్లకాల్వ గ్రామం వైఎస్సార్ స్మృతివనం సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కుక్కల దాడిలో దుప్పి మృతి చెందింది.

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పాత బస్టాండులో ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి నేడు ప్రారంభించనున్నారు. ఉదయం పది గంటలకు ఆయన ప్రారంభిస్తారన్నారు.

పాములపాడు: అధికారులు, పాలకులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ సరోజిని వర్జినియా అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు.

కొత్తపల్లి: ఎదురుపాడులోని ఎంపీపీ పాఠశాలకు దారి చూపాలని విద్యార్థులు,తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న సందులో మట్టిదారిలో మురుగు పారుతున్న రహదారి పై విద్యార్థులు నడవలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

నందికొట్కూరు: నందికొట్కూరు సీఐ కార్యాలయం వద్ద నాగటూరు గ్రామానికి చెందిన గ్రామస్థులు, మృతురాలి బంధువులు ధర్నా చేపట్టారు. నాగటూరులో కోడలిని బండరాయితో హతమార్చిన మామ కురుమన్న స్థానిక పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. గ్రామస్థులు, బంధువులు ఆటో, ట్రాక్టర్లలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిందితుడ్ని తమకు అప్పగించాలంటూ నినదించారు.

నందికొట్కూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన విలీన సభను జయప్రదం చేయాలని మాస్‌లైన్ జిల్లా నాయకుడు వేల్పుల అర్లప్ప పిలుపునిచ్చారు. ఈ నెల 20వ తేదీ హైదరాబాద్‌లో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సాధారణ సమావేశంలో విలీన ప్రకటన చేయాలని నిర్ణయించిందన్నారు.

మిడుతూరు: పలు గ్రామాల్లోని 35 బోరు బావుల వద్ద ఉన్న రాగి, ఇనుప తీగలను దొంగిలించిన నిందితుల నుంచి టన్ను ఐరన్, రూ.1.63 వేల విలువ చేసే రాగి, విద్యుత్తు తీగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఓబులేసు తెలిపారు. ఆరుగురు నిందితులను విలేకరుల ఎదుట హాజరుపర్చారు. రెండు ఆటోలు ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పాలకొరత.. తీరని వెత

నందికొట్కూరు నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పాల కొరత ఏర్పడింది. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాలున్నాయి. ఈ మండలాల్లో 247 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో 18 నుంచి 22 మంది చిన్నారులు సుమారు 4,446 మంది చిన్నారులున్నారు. వీరికి మధ్యాహ్నం సమయంలో 100 గ్రాముల పాలు కాచి చల్లర్చి పంపిణీ చేయాలి. నందికొట్కూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సుమారు 70శాతం కేంద్రాల్లో పాల కొరత ఏర్పడింది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. – న్యూస్‌టుడే, నందికొట్కూరు

విత్తన శుద్ధి తప్పనిసరి

వెలుగోడు, న్యూస్‌టుడే: పంటలు సాగు చేసే రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం వెలుగోడు పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏవో పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వీబీఎన్-8 రకం మినుము విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తుపాను ప్రభావం గురించి ముందస్తు సమాచారం ఉన్నందున రైతులు అప్రమత్తమై పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పట్టణంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ, కల్యాణ్, నాగమణి, రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


వెలుగోడు: మినుము విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

నేలవాలి తీరని నష్టం

మహానంది, న్యూస్‌టుడే: తుపాను కారణంగా రైతన్న ఆశలు అడియాసలయ్యాయి. ఆరుగాలం కష్టంచి పండించిన పంటలు వర్షంతో పాటు గాలులకు నేలవాలిపోయి తీరని నష్టాలను కలిగించాయి. తమడపల్లె, గోపవరం, బొల్లవరం చెరువుల కింద, నందిపల్లె, సీతారామాపురంతోపాటు పలుగ్రామాల రైతులు బోరుబావుల కింద సాగుచేసిన వరి పంటలు నేలవాలిపోయాయి. సొంత భూములున్న రైతులతో పాటు ఒక్కో కౌలురైతు రూ. 40 వేలలోపు కౌలును చెల్లించడమేకాక, పెట్టుబడులకోసం మరో రూ. 50 వేల వరకు ఖర్చు చేసి నష్టపోయినట్లుగా వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.


పడిపోయిన వరిపంట

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

గడివేముల, న్యూస్‌టుడే: అధిక వర్షంవల్ల దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి తెలిపారు. గని, ఎల్‌కేతండా, ఒండుట్ల గ్రామాల్లో పంటలను పరిశీలించారు. అధిక వర్షాల వల్ల పొగాకు పంటకు విల్ట్ తెగులు సోకిందని చెప్పారు.


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఆ నృత్యం.. సుమనోహరం

☛ చిన్న వయసులో వందకు పైగా ప్రదర్శనలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: బుడిబుడి అడుగులు వేసే చిన్నారి నృత్యం చేస్తుంటే మయూరికి నాట్యం నేర్పించినట్లుగా ఉందని పలువురు కొనియాడుతున్నారు. సంప్రదాయ నృత్యంపై ఆసక్తితో కూచిపూడి నేర్చుకుని చిన్న వయసులోనే ప్రదర్శనలు ఇస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తోంది. నంద్యాల పట్టణం సంజీవనగర్‌కు చెందిన మహాలక్ష్మి, సురేశ్ దంపతుల కుమార్తె శ్రీనిత్య మూడో తరగతి చదువుతోంది. ఒకటో తరగతిలోనే సంప్రదాయ నృత్యమైన కూచిపూడిలో తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బాలభవన్‌లోని శిక్షకుడు నరసింహులు వద్ద తర్ఫీదు పొందిన బాలిక ప్రముఖ పుణ్యక్షేత్రాల్లోనూ, కళారాధన, ఇతర కార్యక్రమాల్లోనూ వందలాది ప్రదర్శనలు చేసి అలరించింది.


కూచిపూడి నృత్యం చేస్తున్న శ్రీనిత్య

ఇవీ విజయాలు

❖ 2023లో నంద్యాలలో కళారాధన ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకుంది.

❖ 2023లో నంద్యాలలో జరిగిన బాలోత్సవం కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొని తృతీయ స్థానం సాధించింది.

❖ 2024లో ఆగస్టులో నంద్యాలలో కళారాధన ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి పోటీల్లో పాల్గొని జ్యూరీ పురస్కారం, ప్రశంసాపత్రం అందుకొంది.

❖ 2024 జులైలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన బ్రహ్మోత్సవాలలో పాల్గొని నృత్య ప్రదర్శనలు చేసి ప్రముఖుల ప్రశంసలు అందుకొంది.

❖ 2024లో అహోబిలం బ్రహ్మోత్సవాలలో కూచిపూడిలో అద్భుత ప్రదర్శనలు చేసి ప్రశంసా పత్రాలు స్వీకరించింది.

❖ 2024 ఆగస్టులో నంద్యాలలో జరిగిన అభయ్ హిందూ సేన కార్యక్రమంలో కూచిపూడి నృత్యం చేసి రాదామనోహర్ దాస్ నుంచి ప్రశంసలు పొందింది

❖ 2024లో మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేసి ప్రశంసా పత్రాలు అందుకొంది.

❖ 2024లో మహానందిలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శనలు చేసి ప్రశంసలు పొందింది.


వెంగళరెడ్డిపేటలో భూమిపూజ చేస్తున్న తెదేపా నాయకులు

రూ.33 లక్షలతో అభివృద్ధి పనులు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: కడమలకాల్వ, వెంగళరెడ్డిపేట గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 33 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టన్నట్లు తెదేపా నాయకులు శ్రీనివాసులు, భూపాల్ తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో ఎంపీడీవో దస్తగిరి భూమిపూజ చేశారు.

వెలుగోడు, న్యూస్‌టుడే: పల్లె పండుగలో భాగంగా వెలుగోడు మండలంలోని మోతుకూరు, బోయరేవుల, గుంతకందాల గ్రామాలకు నేడు శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పాల్గొంటారని తెదేపా మండల, పట్టణ అధ్యక్షుడు అన్నారపు శేషిరెడ్డి, ఖలీల్‌ఖాన్ తెలిపారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారని వివరించారు.

గ్రామీణ రహదారులకు మోక్షం


భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి

గడివేముల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో గ్రామీణరోడ్లకు మోక్షం లభించిందని మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి అన్నారు. దుర్వేశి, కొరటమద్ది, తిరుపాడు గ్రామాల్లో శుక్రవారం 'పల్లె పండుగ'లో భాగంగా సీసీ రహదారులకు భూమిపూజ చేశారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉపాధి హామీ పనుల కింద సీసీ రహదార్లు నిర్మాణం చేపట్టినట్లు మాజీ సర్పంచి గంగనారాయణ అన్నారు. పల్లెపండుగలో భాగంగా శుక్రవారం మండలంలోని కొండజూటూరు, గోరుకల్లు గ్రామాల్లో సీసీ రహదార్ల నిర్మాణానికి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఉపతహసీల్దారు శివరామిరెడ్డి, పంచాయతీరాజ్ ఇంజినీరు బాషాతో కలిసి తెదేపా నాయకులు భూమి పూజ చేశారు. గోరుకల్లు రవి, కేశవ, యాకోబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

మిడుతూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసిందని జలకనూరు గ్రామ తెదేపా నాయకుడు గుండం శివరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జలకనూరు గ్రామంలో రూ. 25 లక్షలతో సీసీ రహదారి నిర్మాణానికి ఎంపీడీవో దశరథ రామయ్య, ఇతర అధికారులతో కలిసి భూమి పూజ చేపట్టారు. సర్పంచి ఎల్లయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి


రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, కల్యాణి

నల్లమేకలపల్లె (ప్యాపిలి), న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అరటి తోటలో సిగటోక తెగుళ్లు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు రైతులకు సూచించారు. ప్యాపిలి మండలం నల్లమేకలపల్లె, పీఆర్‌పల్లె, హుసేనాపురం గ్రామాల్లోని అరటి తోటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాతావరణ ఉక్కపోత ఉండటంతో సిగటోక, ఆకుమచ్చ తెగుళ్ల వ్యాప్తి చెందుతాయన్నారు. అరటి తోటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. డోన్ ఉద్యాన అధికారి కల్యాణి, రైతు సేవా కేంద్ర సిబ్బంది బాలు, సురేంద్ర, నళిని పాల్గొన్నారు.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: బస్సు ప్రమాదంలో గాయపడిని విద్యార్థినులకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని విజయ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు.. ఈ ప్రమాదానికి కారణమైన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల, న్యూస్‌టుడే: **సమస్య:** శిరివెళ్ల నుంచి చిన్న కంబళూరుకు వెళ్లే బీటీ రహదారి దెబ్బతింది.
–నరేష్, శిరివెళ్ల

సమాధానం: ప్యాచ్ వర్కు పనులకు ప్రతిపాదనలు పంపించాం. –శ్రీనివాసశర్మ, ఈవోపీఆర్డీ, శిరివెళ్ల

ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే: బాలికలు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యలను చేరుకోవాలని డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో అత్యాచారాలు, లైంగిక వేధింపులు జరుగుతున్నాయని.. బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలకు సంబంధించి పలు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సరళ, పీడీ విజయలక్ష్మి, ఎస్సై మధుసూదన్, ఆర్డీటీ టెక్నికల్ డైరెక్టర్ మురళి, రీజనల్ డైరెక్టర్ సరస్వతి, నరసింహులు, నాగభూషణం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి

బాలుర వసతి గృహం తనిఖీ

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి కొండపేటలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జీ షేక్ అబ్దుల్ రహిమాన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలోని వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని వార్డెన్ శ్రీనివాసరెడ్డికి సూచించారు. నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మరుదొడ్లలో విద్యుత్తు దీపాలు లేక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు అల్లా ఉద్దీన్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.


వార్డెన్‌తో మాట్లాడుతున్న జడ్జీ షేక్ అబ్దుల్ రహిమాన్

కోవెలకుంట్లలో జర్మన్ దేశస్థులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల సెయింట్ జోసెఫ్ పాఠశాలను జర్మన్ దేశస్థులు శుక్రవారం సందర్శించారు. ఏడుగురు జర్మన్ దేశీయులు పలు ప్రాంతాలు పర్యటిస్తూ పాఠశాలకు రాగా విద్యార్థులు, ఉపాధ్యాయులు వారికి స్వాగతం పలికారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. విద్యార్థులతో సమావేశమై వారు చదువుతున్న విధానం, ఇక్కడి పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. కర్నూలు, మంచాలకట్ట చర్చిల పాదర్లు ఆహ్వస్, తోట జోసఫ్, పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌మేరీ, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ గీతా పాల్గొన్నారు.


సెయింట్ జోసెఫ్ పాఠశాలను సందర్శిస్తున్న జర్మన్ దేశీయులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: కర్నూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జశ్వంత్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం పద్మావతమ్మ శుక్రవారం తెలిపారు. ఈ నెల 21న హిందూపూర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడా పోటీల్లో జిల్లా జట్టు తరఫున జశ్వంత్ పాల్గొననున్నట్లు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్లు లక్ష్మీప్రభావతి, హుస్సేన్‌బాను, సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.


పాతపేట జడ్పీ పాఠశాల విద్యార్థి జశ్వంత్‌తో పీడీలు

ఎడిసన్‌కు నివాళి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని పద్మావతమ్మ అధ్యక్షతన థామస్ ఆల్వా ఎడిసన్ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, లక్ష్మయ్య, రాధ, బాబు, వెంకటలక్ష్మీ, లక్ష్మీకాంతరెడ్డి, సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఎడిసన్‌కు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు

అప్రమత్తంగా ఉండాలి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బేతంచెర్ల పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వసంత లక్ష్మి, డాక్టర్ అజయ్ కుమార్ పేర్కొన్నారు. బేతంచెర్ల పట్టణంలోని శేషారెడ్డి పశు వైద్యశాలలో సన్న జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ నెల 16 నుంచి 31 వరకు సన్న జీవాలకు నట్టల నివారణ మందు వేయడం జరుగుతుందన్నారు.

లైఫ్ సభ్యులకు రాష్ట్రస్థాయి అవార్డు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల లైఫ్ యువనేత్ర సభ్యులు రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ వారు బేతంచెర్ల లైఫ్ యువనేత్ర సభ్యులు 364 మంది నేత్రాలను సేకరించినందుకు ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి అధినేత ఆర్.ఎన్ రావు చేతుల మీదుగా పవన్ కుమార్, అక్బర్ హుస్సేన్, పవన్ కుమార్, విజయేంద్రారెడ్డిలను అభినందించి అవార్డును అందుకున్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రక్షాళన

రేషన్ దుకాణాల విభజనకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాల విభజన దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా 800 కార్డులకుపైగా ఉన్న రేషన్ దుకాణాన్ని రెండుగా చేసేందుకు రంగం సిద్ధమైంది. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాల కారణంగా ప్రజా పంపిణీ వ్యవస్థ లోపాలమయంగా మారింది. ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టి అనవసర ఖర్చుకు తెరలేపింది. సమయ పాలన లేకపోవడం, నిబంధనలు పాటించకపోవడం వంటి లోపాలతో కార్డు దారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దశలో డీలరు వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు, వారి ఆదాయాల్లో హెచ్చు తగ్గులను తగ్గించేలా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. కొత్తగా 200 వరకు చౌక దుకాణాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

నియోజకవర్గం	చౌక దుకాణాలు	ఎండీయూ వాహనాలు
ఆళ్లగడ్డ	217	65
బనగానపల్లి	209	56
డోన్	171	58


వీధిలో ఒక చోట నిలిపి సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం

కార్డుల సంఖ్యలో హెచ్చుతగ్గులు

సాదారణంగా ఒక్కో డీలరుకు 800 కార్డులు ఉండాలి. అయితే కొందరు డీలర్లకు 800 నుంచి 1,200 వరకు ఉండగా కొందరికి మాత్రం కేవలం 150 నుంచి 300 వరకు ఉంటున్నాయి.

★ ఆళ్లగడ్డ మండలంలోని 1338038 నంబరు చౌక దుకాణంలో 888 కార్డులు ఉండగా, 1338050 దుకాణంలో కేవలం 126 కార్డులు మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లోని కార్డుల సంఖ్యలో అసమానత్వం కన్పిస్తోంది. అధిక కార్డులు ఉన్న డీలరు అధిక కమిషన్ పొందుతుండగా, తక్కువ కార్డులు ఉన్న డీలరు తక్కువ కమిషన్ వస్తుంది.

ఇలాంటి లోపాలను సరిదిద్దేందుకు 800 వరకు కార్డుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని చౌక దుకాణాల విభజనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

★ డోన్ మండలంలో 1385098 నంబరు రేషన్ దుకాణంలో 1,049 కార్డులు ఉన్నాయి. అదే మండలంలో 1349052 రేషన్ దుకాణానికి కేవలం 209 కార్డులు మాత్రమే ఉన్నాయి.

దుకాణాల విభజన చేపడుతున్నాం
-శేఖర్‌రెడ్డి, సీఎస్‌డీటీ, ఆళ్లగడ్డ

800పైగా కార్డులకు ఉన్న రేషన్ దుకాణాన్ని రెండుగా విభజించే విధంగా ప్రతిపాదనలు ప్రభుత్వం నుంచి వచ్చాయి. ఈ మేరకు అధిక కార్డులున్న దుకాణాలను గుర్తిస్తున్నాము. 800 తక్కువ కార్డులున్న దుకాణాలను అలాగే కొనసాగిస్తాం.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణంలో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్తు సబ్ ఇంజినీర్ హుస్సేన్ బాషా శుక్రవారం తెలిపారు. నిర్వహణ నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సంజామల, న్యూస్‌టుడే: మండలంలోని పేరుసోముల, నొస్సం విద్యుత్తు ఉపకేంద్రాల్లో శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. విద్యుత్తు ఉపకేంద్రాల్లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

గొలుసు దొంగల హల్‌చల్

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాపురంలో పట్టపగలే గొలుసు దొంగలు హల్చల్ చేశారు. శుక్రవారం ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై గ్రామంలోని ఓ దుకాణం వద్దకు వెళ్ళారు. అక్కడ ఉన్న వెంకటేశ్వరమ్మ అనే వృద్ధురాలికి రేషన్ బియ్యం కోసం ఫోటోలు తీస్తున్నాం అని చెప్పారు. బంగారు గొలుసు ఉంటే మీకు ఉచిత బియ్యం రావని నమ్మించారు. ఆమె మెడలో నుంచి గొలుసు తీసి పక్కన పెట్టగానే వారు దాన్ని తీసుకొని పారపోయారు. దీంతో బాధితురాలు లబోదిబోమంటూ కేకలు వేసింది. చుట్టు పక్కల వారు వచ్చి చూసే సరికి వారు కనపడకుండా వెళ్లిపోయారు. గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు పేర్కొన్నారు.

కూలిన మిద్దె.. తప్పిన ప్రమాదం

పలుకూరు(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని పలుకూరు కొత్తపేటలో నారాయణరావుకు చెందిన మట్టి మిద్దె పైకప్పు శుక్రవారం కూలింది. ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పు పడిపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.


కూలిన మట్టి మిద్దెను చూపుతున్న నారాయణరావు

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన పెళ్లి బస్సు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కర్నూలు రైల్వే గేట్ సమీపంలో ఎస్సీ కాలనీ రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాలను పెళ్లి బస్సు ఢీ కొన్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. రహదారిపై వెళ్తున్న పెళ్లి బస్సు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టినట్లు స్థానికులు పేర్కొన్నారు. దీంతో వరుసగా మూడు స్తంభాలు విరిగిపడి పూర్తిగా దెబ్బతిన్నట్లు విద్యుత్తుశాఖ ఏఈ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్తుశాఖ అధికారులు విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. ఈ ప్రమాదంలో రూ.1.30 లక్షల నష్టం వాటిల్లినట్లు ఏఈ పేర్కొన్నారు. బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్తుశాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన కొత్త వాటిని ఏర్పాటు చేశారు.


బస్సు ఢీ కొట్టడంతో విరిగిపడిన విద్యుత్తు స్తంభం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామకృష్ణాపురం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కిరణ్(35) గురువారం విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గుర్తించిన కుటుంబ సభ్యులు నంద్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని భార్య ప్రేమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందివర్గం ఎస్సై వెంకటసుబ్బయ్య తెలిపారు.

‘ప్రాణహాని ఉంది కాపాడండి’

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: న్యాయవాది కృష్ణప్రసాద్, అతని కుమారుడు హరీష్, పొలం యజమాని హరి నుంచి ప్రాణహాని ఉందని బాధితుడు సంగు స్వామిరెడ్డి శుక్రవారం డోన్ డీఎస్పీ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఉడుములపాడు గ్రామంలో సర్వే నంబరు 782లో 2.13 ఎకరాల భూమి ఉంది. ఈ స్థలంలో న్యాయవాది కంకర ఫ్యాక్టరీ వేశారు. ఈ ఫ్యాక్టరీ వల్ల పక్కన ఉన్న పొలంలోకి దుమ్ము వస్తుందని, తన పంటను నాశనం చేశారని పోలం యజమాని సంగు స్వామిరెడ్డి గత నెల 12న ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కృష్ణప్రసాద్‌పై గత నెల 23న పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఇంతియాజ్‌బాషా కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాపై కక్ష పెంచుకుని వీరు ముగ్గురు కలిసి నన్ను చంపడానికి ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని బాధితులు శుక్రవారం డోన్ డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో వరప్రసాదరావు అన్నారు. కోవెలకుంట్లలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచి, వార్డు సభ్యులకు శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని 19 పంచాయతీల పరిధిలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మంజుల వాణీ మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధి, ప్రజా ప్రతినిధులు, అధికారులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: గ్రామ పాలనపై అవగాహన అవసరమని మండల అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ ఉపసర్పంచులు, వార్డు నెంబర్లకు ఏర్పాటైన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో శుక్రవారం మండలంలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పాత్రను వివరించారు. అధికారులతో కలిసి పని చేయాలని సూచించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బేతంచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో 19 గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఫజల్ రహిమాన్ గ్రామాభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని సూర్య డ్రెస్సెస్‌కు చెందిన రత్నం 400 జతల దుస్తులను స్థానిక విక్కీ ఫౌండేషన్‌కు వితరణ చేశారు. ఈ దుస్తులను విక్కీ ఫౌండేషన్ నిర్వాహకుడు ప్రతాప్‌రెడ్డి(విక్కీ) శుక్రవారం విజయవాడకు తీసుకెళ్లి అక్కడి స్వచ్ఛంద సంస్థ సహకారంతో వరద బాధితులకు పంపిణీ చేశారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడిలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జిగాళ్ల లింగన్న డిమాండ్ చేశారు. కోవెలకుంట్లలో జరిగిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడలో పగడాల నాగలక్ష్మికి చెందిన లేడీస్ కార్నర్ దుకాణంలో శుక్రవారం విద్యుదాఘాతానికి దుస్తులు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షలు నష్టం జరిగిందని బాధితురాలు తెలిపారు.

రుద్రవరం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం కోరం లేక 11:45 గంటలకు ప్రారంభమైంది. అధికారులు వచ్చి తమ ప్రగతి నివేదికలను చదవి వినిపించారు. సమస్యలపై ప్రశ్నించేవారు లేకపోవడంతో గంటలోనే సమావేశం ముగిసింది.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ఏకధాటిగా కురవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టులో ఉన్న పలు వీధులు జలమయంగా మారాయి. సంతలో వ్యాపారు, ప్రజలు అవస్థలు పడ్డారు.

ఘనంగా చౌడేశ్వరి పల్లకోత్సవం


పల్లకి ఉత్సవంలో ఆలయ సిబ్బంది, భక్తులు

నందవరం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం పల్లకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకిని అందంగా అలంకరించి ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్తు వినియోగదారులపై భారం మోపుతుందని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయిలకొండ నాగరాజులు పేర్కొన్నారు. ప్రజలపై అధిక భారాన్ని మోపుతున్న విద్యుత్తు ఛార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విద్యుత్తుశాఖ డీఈ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివరాం, రహిమాన్, నక్కిహరి, నాగమద్దయ్య, మధుసూదన్, సుధాకర్, మధు, అశోక్, సురేంద్ర, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయిలకొండ నాగరాజులు

ఉపకేంద్రం ఎదుట ధర్నా

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ప్రజలపై విద్యుత్తు ఛార్జీలను తగ్గించి, సర్దుబాటు ఛార్జీల వసూలు నిలిపి వేయాలని సీపీఎం నాయకులు ఎల్లయ్య, రామాంజనేయులు డిమాండు చేశారు. శుక్రవారం డోన్ రహదారిలోని విద్యుత్తు ఉప కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదన్నారు. సీపీఎం మండల కార్యదర్శి మధుశేఖర్, శ్రీను, ఎల్లరాజు, రాజబాబు, వెంకటేశ్వర్లు, బాష, వెంకటరమణ పాల్గొన్నారు.



విద్యుత్ ఉప కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజినేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక వర్షాలకు రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, మండల కార్యదర్శి వెంకటేశ్, గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు.

వైభవంగా తిరుచ్చి వేడుకలు

ఆర్ఎస్.రంగాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో కొలువైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో తిరుచ్చి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్, ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో స్వామి అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళ హారతి నిర్వహించారు. అనంతరం పల్లకిలో స్వామిని మాఢ వీధుల్లో ఊరేగించారు.


ఆలయ మాఢ వీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

పట్టణ దారులు.. ప్రయాణికులకు అవస్థలు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలోని ప్రధాన రోడ్లు గుంతల మయంగా మారాయి. దీంతో ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు రోడ్లు మరింత దారుణంగా మారి పోయాయి. ప్రధాన రహదారులు ఛిద్రమవడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో హడావుడిగా వేసిన రోడ్లు నేడు గుంతలకు చిరునామాగా మారాయి.

ఆర్టీసీ బస్టాండు నుంచి ప్యాపిలి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. ఈ దారిలో నిత్యం ప్రజలు, ప్రయాణీకులు నిత్యం తిరుగుతుంటారు. ఆర్టీసీ బస్టాండు నుంచి ప్యాపిలి, గుత్తి, హోళగుంద, యాగంటి వెళ్లే వాహనాలతో పాటు ఇటు వైపు ఉన్న సుమారు పది గ్రామాల ప్రజలు రాక పోకలు సాగిస్తుంటారు. ఇప్పటికే ఇక్కడ పలువురు ద్విచక్ర వాహనదారులు కింద పడి చిన్నపాటి గాయాల పాలైన ఘటనలు ఉన్నాయి. ఆటోలు, ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే గ్రామ పంచాయతీ రోడ్డు గుంతలుగా మారింది. ఆర్అండ్‌బీ ప్రభుత్వ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు సైతం ఛిద్రమైంది. ఈ రోడ్డుపై భారీ వాహనాలు సైతం తిరుగుతుంటాయి. రాత్రి వేళల్లో దిచక్ర వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.


ప్యాపిలి వెళ్లే రహదారిలో గుంతలు

బనగానపల్లి నుంచి కర్నూలు వెళ్లే దారిని ఆరు నెలల కిందట గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలు ముందు హడావుడిగా నిర్మించారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని ఆర్అండ్‌బీ అధికారులు డబల్ రోడ్డు వేశారు. నాసిరకంగా పనులు చేయడంతో ఇప్పుడు ఎక్కడ చూసిన గుంతలే కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు కావడంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో తిరుగుతుంటాయి. స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం నీరు చేరి ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. పెట్రోలు బంకు కూడలి నుంచి నుంచి పట్టణ శివారు వరకు గుంతలు ఏర్పడ్డాయి.


బనగానపల్లి నుంచి కర్నూలు వెళ్లే రహదారి

చర్యలు తీసుకుంటాం –హుసేని, ఆర్అండ్‌బీ ఏఈ

ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. త్వరలోనే గుంతలు పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పొదుపు కార్యాలయంలో కోవెలకుంట్ల క్లస్టర్‌స్థాయి అధికారుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు లింకేజీ, ఉన్నతి, స్త్రీనిధి రుణాలు, జీవనోపాధి, ఫామ్, నాన్ ఫామ్, మండల, గ్రామ స్థాయి సంఘాల గ్రేడింగ్‌లపై చర్చించారు. పొదుపు సంఘాల బలపేతానికి కృషి చేయాలన్నారు. స్త్రీనిధి రుణాల రీకవరికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలాల వారీగా పొదుపు సంఘాల వివరాల ప్రగతిని తెలుసుకున్నారు. కోవెలకుంట్ల ఏసీ గురస్వామి, జిల్లా స్థాయి స్త్రీనిధి మేనేజరు నాగప్రసాద్, జిల్లా డీపీఎంయూ అధికారులు ఎల్లయ్య, సురేష్, బాబురావు, శివ, చెన్నరాయుడు, కృష్ణమూర్తి, ఏడు మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

చాగలమర్రి, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా ఈ నెల 22 నుంచి 25 వరకు ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మంజుల వాణి శుక్రవారం తెలిపారు. ఈ నెల 22న చాగలమర్రి 2, 5 సచివాలయాలు, శెట్టివీడు, గొడిగనూరులో, 23న మల్లెవేముల, మద్దూరు, ముత్యాలపాడు 1, 2, డి.వనిపెంట, 24న పెద్దబోధనం, చాగలమర్రి-1, చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. 25న నేలంపాడు చాగలమర్రి-3 4, చింతలచెరువు సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

నేత్రదానంతో వెలుగులు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మరణానంతరం మట్టిలో కలిసే రెండు నేత్రాలను దానం చేసి అంధుల జీవితాల్లో వెలుగును నింపాలని లైఫ్ యువనేత్ర సభ్యులు పేర్కొన్నారు. బేతంచెర్ల శ్రీనగర్ కాలనీకి చెందిన నాగేశ్వరరెడ్డి(54) అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న లైఫ్ యువనేత్ర సభ్యులు నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. మృతుడి రెండు నేత్రాలను కర్నూలు నేత్రాలయ నిధి టెక్నీషియన్ గంగాధర్ సహాయంతో సేకరించారు.


నేత్రాలు దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

వాటర్‌షెడ్ కమిటీ ఛైర్మన్ ఏకగ్రీవ ఎన్నిక

సంజామల, న్యూస్‌టుడే: మండలంలోని వసంతాపురం, బొందలదిన్నె, హోత్రమాన్‌దిన్నె గ్రామాల వాటర్‌షెడ్ పథకం కమిటీ ఛైర్మన్‌లు, కమిటీ సభ్యులను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతులు వాటర్‌షెడ్ అధికారులు బ్రహ్మానందరెడ్డి, శివనాగరాజు సమక్షంలో గ్రామ సభలో ఎన్నుకున్నారు. వసంతాపురం ఛైర్మన్‌గా నాగరాజు, హోత్రమాన్‌దిన్నె- రఘునాథరెడ్డి, బొందలదిన్నె- హరికుమార్‌రెడ్డిని కమిటీ సభ్యులుగా పలువురు ఎన్నికైయ్యారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

సంజామల, న్యూస్‌టుడే: ఉద్యోగులు విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆశాఖ ఏడీ సతీష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏడీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.